ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు

గురువారం 21 ఆగస్టు 2025

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం మెరుగు

కొమరాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలనతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. డీవార్మింగ్‌లో భాగంగా బుధవారం మాప్ అప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేశారు? ఇంకా ఎంతమందికి వేయాల్సి ఉంది? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో పలువురి విద్యార్థులతో స్వయంగా మాత్రలు వేయించారు.

వర్షం వస్తే.. వణుకే!

- కాజ్‌వేలపై వరద ఉధృతి
- ఏటా వర్షాకాలంలో పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- ప్రజలకు తప్పని ఇబ్బందులు ● కలగా వంతెనల నిర్మాణం
- గత వైసీపీ పాలనలో శంకుస్థాపనలతో సరి ● రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు



దుగ్గేరు వద్ద అడారిగెడ్డ కాజువేపై ప్రస్తుత పరిస్థితి ఇదీ..



ఇటీవల కురిసిన వర్షాలకు కవిరిపల్లి వద్ద కాజ్‌వేను ముంచిన గోముఖి వరదనీరు

మక్కువ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు.. ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వదర ఉధృతి కారణంగా కాజ్‌వేలను దాటి వారి స్వగ్రామాలకు చేరుకోలేని పరిస్థితి. ఏటా వర్షాకాలంలో ఎంతోమంది మృత్యువాత పడుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. వంతెనల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా.. కనీస చర్యలు శూన్యం. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో హడావుడిగా శంకుస్థాపనలు చేసినా .. పనులు చేపట్టలేకపోయారు. మొత్తంగా వర్షం కురిసిన ప్రతిసారీ ఆయా ప్రాంతవాసులు వణికిపోవాల్సి వస్తోంది. మక్కువ మండలంలో పరిశీలిస్తే.. దుగ్గేరు సమీపంలో అడారిగెడ్డపై వంతెన నిర్మాణం కలగా మారింది. ఏళ్లు గడుస్తున్నా.. దీనిపై స్పందించే వారే కరువయ్యారు. వాస్తవంగా మక్కువ మండల కేంద్రానికి 16 కిలోమీటర్లు దూరంలో ఈ కాజ్‌వే ఉంది. దీని మీదుగా సాలూరు- మక్కువ మండలాలకు చెందిన సుమారు 20 గిరిజన గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వర్షాకాలంలో మాత్రం వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కాజ్‌వేపై వరద నీరు ప్రవహించే సమయంలో మూడు రోజుల పాటు ఇళ్లకే పరిమితమవ్వాల్సి వస్తోంది. అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంకా ఈ కాజ్‌వే వరద నీరు ఉధృతంగానే ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల ఇద్దరు వ్యక్తులు ఈ కాజ్‌వేను దాటబోయే క్రమంలో బైక్‌పై కొట్టుకుపోయి.. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఏటా వారు ఈ సమస్యను ఎదుర్కొంటున్న పట్టించుకునే వారే కరువయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడారిగెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాకపోవడంతో నిధులు రద్దయ్యాయి. తాజాగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఆ ప్రాంతాన్ని పరిశీలించిన సమయంలో స్థానికులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో నవంబరు తరువాత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ హామీ ఇవ్వడంతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



అనారోగ్యానికి గురైన వ్యక్తిని అడారిగెడ్డ దాటిస్తున్న గ్రామస్థులు (ఫైల్)


ఇదీ పరిస్థితి..

పార్వతీపురం ఐటీడీఏ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో 1997-98లో సుమారు రూ.25లక్షలతో అడారిగెడ్డపై కాజ్‌వే నిర్మించారు. ప్రస్తుతం అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కాజ్‌వేపై వేసిన సిమెంటు రోడ్డు అధ్వానంగా మారింది. నడిచి వెళ్లడానికి కూడా వీలులేని విధంగా తయారైంది. దీంతో గిరిజనులు సొంతంగా డబ్బులు ఎత్తుకొని మే నెలలో ఆ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. మక్కువ మండలం మెండంగి, బాగుపోల, చెలకమెండంగి, ఆలగురువు, తాడిపుట్టి, బందమెండగి, గ్రామాలతో పాటు సాలూరు మండలంలో శిరివర, చింతామల, పోయిమాల, కొదమ, చోర తదితర గిరిశిఖర గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ కాజ్‌వేనే ప్రధాన మార్గం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడారిగెడ్డ నుంచి శిరివర వరకు రోడ్డునిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాగా నాలుగేళ్ల కిందట గిరిశిఖర గ్రామానికి చెందిన 55ఏళ్ల వ్యక్తి కాజ్‌వే దాటుతూ గెడ్డలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అంతకుముందు దుగ్గేరుకు చెందిన రంగారావు, దానికి రెండేళ్ల ముందు గుంటభద్రకు చెందిన బొందు అనే గిరిజనుడు కూడా ఈ గెడ్డలో కొట్టుకు పోయి ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 10మంది వ్యక్తులు, 100 వరకు మూగజీవాలు గెడ్డలో కొట్టుకుపోయి మృతి చెందినట్లు ఆయా గిరిజన గ్రామాల ప్రజలు చెబుతున్నారు. తమ పంటలను సైతం ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని

(మిగతా 8వ పేజీలో...)

ముగిసిన గడువు

- అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌కు 2020 దరఖాస్తులు ● ఆమోదించినవి 1716.. పెండింగ్‌లో 104 అర్జీలు
- అక్టోబరులో నగదు జమ కానున్నట్లు అధికారుల వెల్లడి



పార్వతీపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' కింద ఈ నెలలో రైతులకు మొదటి విడత నగదు అందజేసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,22,260 మంది ఖాతాల్లో మొదటి విడతగా రూ.84.58 కోట్లు జమచేసింది. కేంద్రం తరపున రూ.2 వేలు, రాష్ట్ర సర్కారు నుంచి రూ.5 వేలు చొప్పున జమ చేశారు. అయితే వివిధ కారణాలతో జిల్లాలో చాలామంది రైతులు ఆ సాయానికి దూరమయ్యారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, ఈకేవైసీ పూర్తి కాకపోవడం కొంతమందికి రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం, ఆధార్ కార్డులు లేకపోవడంతో తదితర కారణాలతో అర్హులైన వ్వటికీ సాయం పొందలేకపోయారు. ఈ నేపథ్యంలో వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అర్హులై ఉండి నగదు జమ కానివారు ఈనెల 20వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. సర్కారు ఇచ్చిన గడువు ముగిసిపోగా.. ఇప్పటివరకు 2020 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా వాటిల్లో 1,841 దరఖాస్తులను పరిశీలించి 1,716 మంది రైతులు పథకానికి అర్హులుగా గుర్తించారు. 21 దరఖాస్తులను తిరస్కరించగా, 104 పెండింగ్‌లో ఉన్నాయి. ఈనెల 20వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తుల ప్రకారం.. మండలాల వారీగా అర్హులైన రైతుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఈ మేరకు వీరఘట్టంలో 227, కొమరాడ 79, పాలకొండ 106, గరుగుబిల్లి 121, పాచిపెంట 91, కురుపాం 117, బలిజిపేట 280, పార్వతీపురం 113, భామిని 121, జియ్యమ్మవలస 153, సీతంపేట 24, సాలూరు 75, సీతానగరం 154, మక్కువ 69, గుమ్మలక్ష్మీపురంలో ఆరుగురు చొప్పున ఉన్నారు. వీరందరికీ అన్నదాత సుఖీ భవ మొదటి విడత నగదు మంజూరు కావాల్సి ఉంది. అయితే పెండింగ్ దరఖాస్తుల పరిశీలిం చిన తర్వాత అర్హుల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అక్టోబరులో జమ

మొదటి విడత వివిధ కారణాలతో 'అన్నదాత సుఖీభవ' నగదు మంజూరు కాని వారు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిన పరిశీలించిన అనంతరం 1,716 మంది అర్హులు ఉన్నట్లు గుర్తించాం. మరో 104 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అర్హులందరికీ అక్టోబరులో మొదటి విడత నగదు జమవుతుంది.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

గంటలోనే ఆస్తి పత్రాలు

- రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు చేసిన ప్రభుత్వం



గంటలోనే ఆస్తిపత్రాలను అందజేస్తున్న పాలకొండ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి

పాలకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో వినూత్న మార్పులు చేసింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటలైజేషన్ ద్వారా సులభతరం చేసింది. ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (ఐజీఆర్ఎస్) ద్వారా ఒక గంటలోపు ఆస్తి పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేసింది. ముందుగా ప్రజలు ఐజీఆర్ఎస్ పోర్టల్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో అపాయింట్ మెంట్‌బుక్ చేసుకోవాలి. స్లాట్ బుక్ చేసిన వారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో 10 నుంచి 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయొచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), రిజిస్టర్డ్ డీడ్ వంటి పత్రాలు జారీ చేస్తారు. వాస్తవంగా రిజి స్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర రెవెన్యూ డేటా బేస్‌తో అనుసంధానం చేశారు. దీనివల్ల డాక్యుమెంట్ వెరిఫికేషన్ జారీ

(మిగతా 8వ పేజీలో...)

రిజిస్టర్ పోస్టుకు సెలవు

- స్పీడ్ పోస్టులో విలీనం ● సెప్టెంబరు 1 నుంచి అమలు

6లో


ప్రమాదమైనా.. తప్పని పడవ ప్రయాణం



కొమరాడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నాగావళిపై పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి కాకపోవడంతో నదీతీర ప్రాంతవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో ఇంకా వరద ఉధృతి తగ్గలేదు. దీంతో బుధవారం కొమరాడ-కొట్టు గ్రామస్థులు నదిలో పడవ ప్రయాణం చేయాల్సి వచ్చింది. పార్వతీపురం మీదుగా ఆయా గ్రామాలకు చేరుకోవాలంటే చుట్టూ తిరిగి సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే నదిలో అయితే ఐదు కిలోమీటర్లు ప్రయాణిస్తే చాలు. దీంతో ఏటా వర్షాకాలంలో ప్రమాదమైనా ఇలా వారు పడవలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కాగా ఇప్పుడున్న మర పడవ మరమ్మతులకు గురైంది. భారీ ప్రమాదం సంభవించక ముందే ప్రజాప్రతినిధులు, అధికా రులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. కాగా పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తయితే 9 పంచాయతీల్లో 42 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పుతాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

సురక్షిత నీటిని సరఫరా చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రతి గ్రామానికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి గ్రామీణ నీటి సరఫరా, పీఆర్ శాఖాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవా లన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానం ఉండే ప్రదేశాల్లో నీటి పరీక్షలు నిర్వహించాలని తేల్చిచెప్పారు. పైపులైన్లు దెబ్బతినే చోట తాగునీటి సరఫరా నిలిచిపోరాదని, అటువంటివి వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పారిశుధ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఆదికర్మ యోగి పథకంతో గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన గ్రామాల్లో పాలన, సేవల మెరుగుకు శిక్షణ పొందిన కార్యకర్తలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ ఏపీవో ఏ.మురళీధర్ రాష్ట్రస్థాయి శిక్షకుడిగా శిక్షణ పొందారన్నారు. జిల్లా స్థాయి శిక్షకుల మొదటి బ్యాచ్‌ను ఈ నెల13 వరకు పార్వతీపురం ఐటీడీఏలో నిర్వహించామని వెల్లడించారు. రెండో బ్యాచ్ ఈ నెల 21 వరకు జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో 165 గ్రామాల్లో సుమారు 83 వేల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారన్నారు.

బార్ లైసెన్సుదారులకు
రాయితీలు

విజయనగరం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన బార్ పాలసీ విధానంలో లైసెన్సుదారులకు అనేక రాయితీలు కల్పించినట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు తెలిపారు. కొత్త విధానంలో ఒక వ్యక్తికి ఒకటికి మించి బార్లు కేటాయింపునకు అవకాశం ఉందన్నారు. పనివేళలు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ పెంచారని వెల్లడించారు. బార్ లైసెన్సు ఫీజు రూ.55 లక్షలు, రూ.35 లక్షల శ్లాబ్ విధానంలో ఉంటుందన్నారు. గరిష్ఠంగా రూ.65 లక్షలుగా నిర్ణయించామన్నారు. ఆరు సమాన వాయిదాల రూపంలో లైసెన్సు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నామని, అమ్మకాలు ప్రారంభమయ్యాక రెండు నెలల తరువాత చెల్లించొచ్చని తెలిపారు. ఈ విధానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు.



టీచర్ల నియామకానికి కసరత్తు

- ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ● ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 583 పోస్టులు

సాలూరు రూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించనుంది. ఉపాధ్యాయుల నియామకానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను ఒకటి, రెండు రోజుల్లో పరిశీలించే అవకాశముంది. దీనికి సంబంధించి ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఎంఈవోలు, ఎల్‌డీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లుతో కూడిన 24 మంది బృందం బుధవారం విజయవాడలో శిక్షణ పొందింది. ఈ బృందం జిల్లాకు చేరుకుని మెగా డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనుంది.

వచ్చేనెలలో విధుల్లో చేరే అవకాశం..

ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 583 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించారు. అభ్యర్థులు సాధించిన మార్కులను వ్యక్తిగత స్కోర్ కార్డులను ఈ నెల 11న విద్యాశాఖ విడుదల చేసింది. భర్తీ చేయాల్సిన పోస్టుల వివరాలను ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి జిల్లా విద్యాశాఖ నుంచి అందించారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం అభ్యర్థులు ఏ తేదీన రావాల్సి ఉంటుందో వారి మొబైల్స్‌కు మెసేజ్‌లు వచ్చే అవకాశముంది. మెగా డీఎస్సీలో టీచర్లు పోస్టుల భర్తీకి తుది అంకానికి చేరుకుంది. ధ్రువపత్రాల పరిశీలన తదితర కార్యక్రమం అనంతరం వచ్చే నెలలో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరే అవకాశముంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే టీచర్ పోస్టుల భర్తీకి కృతనిశ్చయంతో ముందుకు అడుగులు వేస్తుండడంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీటీలు 210, పాఠశాల సహాయకులు క్యాడర్‌లో తెలుగులో 14, హిందీలో 14, ఆంగ్లంలో 23,గణితంలో 8, భౌతికశాస్త్రంలో 32, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 62, పీఈటీ 63 మొత్తం 446 టీచర్ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్టీటీలు 60 పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లంలో 7, గణితంలో 25, భౌతిక శాస్త్రంలో 24, జీవశాస్త్రంలో 16,సాంఘిక శాస్త్రంలో 5 మొత్తం 137 టీచర్ పోస్టులు ఖాళీలను చూపించారు.

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన

6లో

ఇంకా తేరుకోలే..!

- ముంపులోనే పంటలు.. ఆందోళనలో రైతులు
- ఘాట్ రోడ్డుపై మట్టి, రాళ్లు.. రాకపోకలకు ఇబ్బందులు

6లో

నాగావళిలో తగ్గని వరద


6లో

గంగరేగువలసలో గజరాజులు

6లో



రిజిస్టర్ పోస్టుకు సెలవు



● స్పీడ్ పోస్టులో విలీనం ● సెప్టెంబరు 1 నుంచి అమలు

రాజాం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)

పౌరసేవలతో పాటు బ్యాంకింగ్ సేవల్లో దూసుకుపోతోంది పోస్టల్‌శాఖ దేశంలో ఉన్న అత్యంత పురాతనమైన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కూడా ఇదే. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ కూడా వ్యాపార ధోరణితో సాగుతోంది. ఇందులో భాగంగా పురాతన సేవలకు స్వస్తి పలుకుతోంది. పోస్టల్‌లో 171 సంవత్సరాల పాటు సేవలందించిన రిజిస్టర్ పోస్టు సేవలకు బ్రేక్ చెప్పింది. దీన్ని స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబరు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ విషయంపై జిల్లాలోని అన్ని పోస్టల్ శాఖ అధికారులకు, బ్రాంచ్ పోస్టు మాస్టర్లకు ఆదేశాలు వచ్చాయి. రిజిస్టర్ పోస్టు 1854లో బ్రిటీష్ చక్రవర్తి లార్డ్ డల్హౌసి ప్రవేశపెట్టారు. దాదాపు 171 సంవత్సరాల పాటు ఇది సేవలందించింది. ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలను పంపడానికి ఇది ఎంతో ఉపయోగపడింది. పంపించిన వస్తువు, పత్రం అవతలి వారికి చేరినట్టు రశీదు (డెలివరీ ప్రూఫ్) పొందడం దీని ప్రత్యేకత.

సేవలు మరింత విస్తృతం..

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పోస్టల్ సేవలు విస్తృతం అయ్యాయి. అనేక రకాలుగా సేవలు అందుతున్నాయి. పొదుపు, ఆధార్ సేవల్లో కూడా ఈ శాఖ కీలకంగా మారింది. ఏటా ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచుకుంటోంది. కమీషన్ ప్రతిపాదికగా నిరుద్యోగ యువతను సైతం సేవల కోసం వినియోగించుకుంటోంది. వారికి ఉపాధి కల్పిస్తోంది. పోస్టల్ సేవలను మరింత ఆధునికీకరించేందుకు రిజిస్టర్ పోస్టు స్పీడ్ పోస్టులో విలీనం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు మెరుగుపరచుకోవడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటివి ఈ విలీన ప్రక్రియకు కారణాలుగా తెలుస్తోంది. స్పీడ్ పోస్టు అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు విలీనం కావడం వల్ల.. స్పీడ్ పోస్టు డెలివరీలు మరింత వేగవంతం అవుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్టు ద్వారా మీ పార్సిల్ ఎక్కడికి వెళ్లిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఉంటుంది.

ప్రభుత్వ శాఖలే అధికం..

సాధారణంగా ప్రభుత్వ శాఖలే ఎక్కువగా రిజిస్టర్ పోస్టు సేవలను వినియోగించుకునేవి. అన్నిరకాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ రిజిస్టర్ పోస్టు ద్వారా చేసేవి. అందుకే ముందుగా పోస్టల్‌శాఖ ప్రభుత్వ శాఖలకు ఈ విషయంపై సమాచారం అందించింది. సెప్టెంబరు 1న విలీన ప్రక్రియ ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. అయితే రిజిస్టర్ పోస్టును నిలిపివేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ పోస్టులో విలీనం చేస్తుండడంతో అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. స్పీడ్ పోస్టు రుసుం పెరుగుతుందని భయపడుతున్నారు. సాధారణంగా స్పీడ్ పోస్టు కంటే రిజిస్టర్ పోస్టు చార్జీలు తక్కువగా ఉంటాయి. విలీనం జరగడంతో స్పీడ్ పోస్టు ఛార్జీలు సవరించాలని ఎక్కువమంది కోరుతున్నారు. వందల సంవత్సరాలు సామాన్య జనంతో పెనవేసుకుపోయిన రిజిస్టర్ పోస్టు కనుమరుగు కావడం నిజంగా బాధాకరమే.

విలీనం నిజమే..



రిజిస్టర్ పోస్టును తపాలాశాఖ స్పీడ్ పోస్టులో విలీనం చేస్తోంది. సెప్టెంబరు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాం. వినియోగదారులకు మరింత వేగంగా సేవలందించేందుకే తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. రెట్టింపు సేవలు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

-గణపతిరావు, పోస్టల్ అధికారి, రాజాం

ముగిసిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



గురజాడ కళాభారతి వద్ద శ్రీ కృష్ణునికి పూజలు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురజాడ కళాభారతిలో జరుగుతున్న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా నగరంలో స్వామి వారి తిరువీధులు నిర్వహించారు. గురజాడ కళాభారతి వద్ద ప్రారంభమైన తిరువీధి ప్రదర్శన కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, దాసన్నపేట, కొత్తపేట, లంకవీధి మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ప్రదర్శించిన కోలాటం అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు హాజరయ్యారు. సమితి ప్రతినిధులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



తిరువీధి ప్రదర్శన

గణనాథుడి విగ్రహాలు సిద్ధం

● 27న వినాయక చవితి
● ఏర్పాట్లు చేస్తున్న కమిటీలు
● పెరిగిన విగ్రహాల ధరలు
● మట్టి వినాయకుల వైపే మొగ్గు



అమ్మకానికి సిద్ధంగా ఆదిదేవుడి విగ్రహాలు



రాజాం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆదిదేవుడి పూజకు వేళవుతోంది. దీనికి అవసరమైన భారీ విగ్రహాలు జిల్లా అంతటా మార్కెట్లో సిద్ధంగా ఉన్నాయి. మరో వారం రోజుల్లో గణనాథుడి పూజకు జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట, తదితర ప్రధాన పట్టణాలలో నిర్వాహక కమిటీలు సన్నద్ధం అవుతున్నాయి. పట్టణం, పల్లెలనే తేడా లేకుండా భారీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. గతంకన్నా భిన్నంగా ఈ ఏడాది గణేశ ఉత్సవాలు నిర్వహించాలని నిర్వాహకులు యోచిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే విగ్రహాల ధరలు కూడా గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగాయి. మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం పెరుగుతుండడం గమనార్హం.

అలంకరణ సామగ్రీ అంతే...

కేవలం విగ్రహాలకే పరిమితం కాకుండా మండలపాల అలంకరణ సామగ్రి సైతం నిర్వాహకులు ఇప్పుడే కొనుగోలు చేస్తున్నారు. చవితికి ఒకటి, రెండు రోజుల ముందు పూర్తి స్థాయిలో ఇవి లభ్యం కావన్న ఆలోచనతో ఉత్సవ కమిటీ సభ్యులు వాటిని సైతం కొంటున్నారు. గతంతో పోలిస్తే ఈసారి వీటి ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి.

అడుగుల ప్రకారం ధర..

విగ్రహాల తయారీ ముడిసరుకుతో పాటు రంగుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఆ ప్రభావం విగ్రహాలపై పడింది. గత ఏడాది అయిదడుగుల ఎత్తు ఉండే విగ్రహం రూ.5 వేలకు అందుబాటులో... ఉంటే ప్రస్తుతం రూ.7 వేలకు పైగా పలుకుతోంది. అత్యధికంగా 12 అడుగుల ఎత్తు గల విగ్రహాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

శతాధిక వృద్ధురాలు మృతి

రాజాం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుక్కావీధికి చెందిన మండా గున్నరాజమ్మ (105) మంగళవారం రాత్రి మృతి చెందారు. స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత జరిగిన సంఘటన లను అందరికీ పూసగుచ్చినట్లు చెప్పేవారామె. మూడేళ్ల క్రితం 102 ఏళ్ల వయసున్న గున్నరాజమ్మను ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ ఓటర్‌గా గుర్తించినన రెవెన్యూ యంత్రాంగం ఘనంగా సత్కరించింది. గత ఏడాది మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాజాంలోని ఓ పోలింగ్ కేంద్రంలో తన కొడుకుతో కలిసి ఓటు వేశారు.



గున్నరాజమ్మ

నాగావళిలో తగ్గని వరద



తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం తగ్గు ముఖం పట్టడం లేదు. బుధవారం పైప్రాంతాల నుంచి నదిలోకి 8 వేల క్యూసెక్కులు చేరింది. దీంతో అధికారులు ముందస్తుగా స్పిల్‌వే గేట్ల నుంచి 6 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 103.80 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1070 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.

గంగరేగువలసలో గజరాజులు



పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలాన్ని గజరాజులు వీడడం లేదు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్న ఏనుగులు బుధవారం గంగరేగువలస గ్రామ సమీపంలో హల్‌చల్ చేశాయి. అక్కడున్న వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు అవి గ్రామంలోకి ఎక్కడ వస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసు కానిస్టేబుల్‌అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన

విజయనగరం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాలను బుధవారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పరిశీలించారు. ఈ ప్రక్రియకు 720 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో కార్యాలయ అధికారులు, సిబ్బంది పత్రాలను పరిశీలించారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

ఇంకా తేరుకోలే..!

● ముంపులోనే పంటలు.. ఆందోళనలో రైతులు
● ఘాట్ రోడ్డుపై మట్టి, రాళ్లు.. రాకపోకలకు ఇబ్బందులు



లివిరి కనపల చెరువు దిగువున పొలంలో ఇసుకమేట్లు



భామినిలోని పత్తి పొలంలో వరదనీరు



బండ్రసింగి ఘాట్‌రోడ్డుపైన రాళ్లు పడిన దృశ్యం



కొండ ప్రాంతం వద్ద ఉధృతంగా పారుతున్న వర్షపు నీరు

భామిని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరిపైరు దెబ్బతింది. ఇంకా ముంపులోనే పంటలు ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. భామిని మండలం లివిరి కనపాల చెరువుకు గండి పడడంతో దిగువన ఉన్న పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరిచేలు మొత్తం కొట్టుకుపోయిందని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. నులకజోడులో ముంపులో ఉన్న వరి చేలు రక్షణకు వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు. మొత్తంగా నులకజోడు, బిల్లుమడ, పసుకుడి, భామిని, లివిరి, దిమ్మిడిజోల, బాలేరు, ఘనసర, కీసర, కోసలి తదితర గ్రామాల్లోని సుమారు 530 ఎకరాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. మరోవైపు వరదలకు కొట్టుకుపోయిన లివిరి గ్రామ రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేశారు.

బండ్రసింగి ఘాట్ రోడ్డు ఇలా..

తివ్వకొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఉధృతికి బండ్రసింగి ఘాట్ రోడ్డు అధ్వానంగా మారింది. కొండపై నుంచి మట్టి, రాళ్లు జారి రోడ్డుపైన పడ్డాయి. కొన్నిచోట్ల వరద నీరు కూడా ప్రవహిస్తుండడంతో భామిని-కురుపాం మండలాల్లో సుమారు పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జలపాతాలు వద్ద నీటి ఉధృతి తగ్గకపోవ డంతో గత రెండు రోజులుగా నిత్యావసర సరుకులకు కూడా వెళ్లలేకపోతున్నామని ఆయా ప్రాంతవాసులు చెబుతున్నారు. ఘాట్‌రోడ్డుపై రాళ్లు, మట్టి తొలగించి రాకపోకలకు వీలు కల్పించాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

రక్తదాన శిబిరం

చీపురుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది చిరంజీవి అభిమానులు, యువత ఈ శిబిరంలో రక్తదానం చేశారు. దాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. విజయనగరం మహారాజా ఆస్పత్రి సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు ఎస్వీజీ శ్రీనివాసరావు, కింతలి మధు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల అద్దె బకాయిలను ఊపేక్షించబోమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. బుధవారం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్, జనతా బజార్‌లో బకాయిలు ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి అద్దెలు వసూలు చేశారు. కొంతమంది వ్యాపారులు సమయం కావాలని కోరగా, కాలపరిమితిలోగా అద్దె చెల్లించకపోతే, దుకాణాలు మూసేస్తామని హెచ్చరించారు. అద్దె దుకాణాల వద్దకు వెళ్లి నోటీసులు అతికించారు.

డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

చీపురుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వైస్ ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ మేజర్ విధానంలో బీఎస్సీలో గణితం, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్సు, జువాలజీ, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏలో పొలిటికల్ సైన్సుతో పాటు పీజీలో ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమెస్ట్రీ), ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్సు) కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఉచిత రిజిస్ట్రేషన్...

రాజాం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డా.స్వప్నహైందవి తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్ విడుదలైందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైందని వెల్లడించారు. ఈ నెల 25 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 25 నుంచి 28 వరకు స్పెషల్ కేటగిరీ పరిశీలన జరుగుతుందని తెలిపారు. 29న వెబ్ ఆప్షన్లలో మార్పులు, 31న సీట్లు కేటాయింపు, సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని డా.స్వప్న హైందవి వివరించారు.

ఐటీఐలో ప్రవేశానికి...

రాజాం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మూడోవిడత ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 29 ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ కార్యాలయానికి హాజరుకావాలన్నారు.

ఆవిష్కాంధ్ర ప్రారంభం

నెల్లిమర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఆవిష్కాంధ్ర కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. స్టార్టప్‌కి, వ్యాపారానికి ఉన్న తేడా , టెక్నాలజీ అభివృద్ధి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. స్కిల్స్ డీన్ డాక్టర్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మెంటాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మెంటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9వ తరగతికి చెందిన ఎస్.చంద్రమౌళి,*పి.ధనుంజయ, జి.భోగరాజు 8వ తరగతికి చెందిన టి.అఖిల్ విజయనగరం జిల్లా జట్టుకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి తెలిపారు. జూనియర్స్ విభాగంలో ఎస్.చంద్రమౌళి, పి.ధనుంజయ ఎంపికైనట్టు వివరించారు.

289 పింఛన్ల రద్దు

వేపాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో గల గ్రామాలకు సంబంధించి 289 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవి కుమార్ తెలిపారు. రద్దయిన పింఛను దారులకు నోటీసులు ఇచ్చామన్నారు.

వంతెనకు నిధుల మంజూరు

సంతకవిటి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాయన్నగెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.10.75 లక్షల నిధులు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విడుదల చేయించారు పాత వంతెన కుప్పకూలడంతో సంతకవిటి, రేగిడి, బూర్జ, ఆమదాలవలస మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నిధులతో కొత్తగా నిర్మించనున్నారు.

దోమల నియంత్రణకు చర్యలు: డీఎంహెచ్‌వో



విజయనగరం: ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్ఓ, ఇతర వైద్యాధికారులు



గరివిడి: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అందరి సమష్టి కృషితోనే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఇంటి లోపల, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొండకరకాం జడ్పీ హైస్కూల్‌లో జిల్లా మలేరియా అధికారి వై.మణి ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ అధికారి అఖిల, వైద్యాధికారి సురేష్, శ్రీరామమూర్తి, సీతారాజు తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో..

గరివిడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో దోమలు వృద్ధిచెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సాయికిరణ్, కె.శివప్రసాద్, బి. శ్రీనివాస్, వెంకటలక్ష్మి, గాయత్రి, ప్రసాద్, సుజాత, వై.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో...

రాజాం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణతో పాటు వీటి వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పొగిరి పీహెచ్‌సీ అధికారులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధిచెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భార్గవి, తేజస్విని, హెచ్ఎం బి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలన్నింటిలో ఒకే సమస్యపై చర్చిస్తారా?

ఎంపీపీని ప్రశ్నించిన ఎంపీడీవో ● వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో వాదించుకుంటున్న ఎంపీడీవో, ఎంపీపీ

లక్కవరపుకోట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావుల మధ్య వాగ్వాదానికి వేదికైంది. బుధవారం జరిగిన సమావేశంలో ఒకరిపై ఒకరు కేకలు వేసుకొని సభను నడిపించే పద్ధతిపై వాగ్వాదానికి దిగారు. సుమారు 9 నెలలుగా ఒకే అంశంపై చర్చ జరగడాన్ని ఎంపీడీవో తప్పుపట్టారు. ఒక వ్యక్తి సమస్యపై సుదర్ఘ సమయం చర్చ జరిపి సభా సమయాన్ని వృథా చేయడంపై ఆయన మండిపడ్డారు. గత నాలుగు సమావేశాల నుంచి కేవలం పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం ఉద్యోగులనే టార్గెట్ చేస్తూ సభను నడిపించడం అధికారుల్లో చిరాకు తెప్పించింది. కేవలం చందులూరు గ్రామ సమస్యపైనే రోజంతా చర్చించుకుంటే మిగతా శాఖల పనితీరు, గ్రామాల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధిపై ఎప్పుడు చర్చిస్తామని ఎంపీపీని ఎంపీడీవో నిలదీశారు. చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్ పంచాయతీ రికార్డులు టాంపరింగ్ అయ్యాయని, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశం గత మూడు సమావేశాల్లో చర్చకు వచ్చిందని.. మరలా అదే సమస్యపై చర్చ మంచిది కాదని ఎంపీడీవో చెప్పడంతో ఎంపీపీ వాగ్వాదానికి దిగారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఎమ్మెల్సీ రఘురాజు కల్పించుకొని సర్దిచెప్పడంతో ఇద్దరూ శాంతించారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్సీ రఘురాజు సభ్యులను, అధికారులను కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని కాపాడండి



ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న గిరిజనులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 'సార్.. జిందాల్ బారి నుంచి మా గ్రామాన్ని.. మమ్మల్ని మీరే కాపాడాల'ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కిల్తంపాలెం పంచాయతీలోని దెప్పూరు గిరిజనులు వేడుకున్నారు. బుధవారం గ్రామానికి వెళ్లిన ఆయనతో స్థానికులు మాట్లాడుతూ తమ తాత, తండ్రుల కాలం నుంచి అక్కడే ఉన్నామని తెలిపారు రెవెన్యూ అధికారులు మాత్రం 2008కి ముందు తాము లేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు తెలియకుండా గ్రామాన్ని అధికారులకు జిందాల్‌కు రిజిస్ట్రేషన్ చేశారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ న్యాయం జరిగే వరకు వారితోనే ఉంటానని భరోసా ఇచ్చారు. అదే సమయంలో పదుల సంఖ్యలో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్సీ రఘురాజు పాల్గొంటున్న కార్యక్రమాలపై పోలీసులు నిఘా ఉంచడం గమనార్హం.

తనిఖీలు నిలుపుదల చేయండి

విజయనగరం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సులు ప్రవేశపెట్టడం వల్ల 90 శాతం ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతిందని.. మరోవైపు రవాణాశాఖాధికారులు తనిఖీల పేరుతో ఈ చలానాలు వేస్తున్నారని విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావులు తెలిపారు. తక్షణమే తనిఖీలు నిలుపుదల చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని బుధవారం రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫైనాన్స్‌కు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఓవైపు ఇళ్లు గడవడం కష్టంగా ఉంటోందని వివరించారు. రవాణాశాఖాధికారులు వేలాది రూపాయలు జరిమానాగా విధించడంతో ఆటో డ్రైవర్లకు ఆత్మహత్యలు తప్ప గత్యంతరం లేదన్నారు. అధికారులు తమ పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు: ఎమ్మెల్యే



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి



మాట్లాడుతున్న కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసేవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ అన్నారు. బుధవారం కృష్ణమహంతిపురం పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా మేడపురెడ్డి శ్రీను, డైరెక్టర్ ఇందుకూరి శ్రీనురాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని, రైతులకు అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు జీఎస్ నాయుడు, రామసత్యం, నేతలు సీహెచ్ఆర్‌కే ప్రసాద్, శ్రీను, లోకాబి రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

వంగరలో...

వంగర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శివ్వాం పీఏసీఎస్ చైర్మన్‌గా బి.రవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. బ్యాంక్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో...

మెరకముడిదాం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చినబంటుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా పల్లి నారాయణరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. చైర్మన్ పి.నారాయణరావు మాట్లాడుతూ తనకు చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కమిడి కళావెంకటరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, భైరిపురం ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, మాజీ మండలాధ్యక్షులు కోట్ల మోతీలాల్ నాయుడు, నాయకులు కెంగువ ధనుంజయ, ఎం.రమణ మోహనరావు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూ సేకరణకు సహకరించండి

వేపాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భూ సేకరణకు రైతులు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.కళావతి కోరారు సోంపురం గ్రామంలో పోలవరం ఎడమ కాలువకు సంబంధించిన భూ సేకరణపై బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం నిబంధనల మేరక నష్ట పరిహారం అందించనున్నట్టు తెలిపారు. పరిహారం విషయంలో అభ్యంతరం ఉంటే కలెక్టర్‌కు తెలియజేయవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జె.రాములమ్మ, భూ సేకరణ డిప్యూటీ తహశీల్దారులు పి.లావణ్య, కె.శ్రీనువాసులు. తదితరులు పాల్గొన్నార

సంగాం దేవస్థానం చైర్మన్‌గా ఆనందరావు

వంగర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సంగాంలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా బోను ఆనందరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో శ్యామలరావు సమక్షంలో చైర్మన్‌తో పాటు 8 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తానని తెలిపారు.

ప్రధాన రహదారిలో కుంగిన కల్వర్టు

సంతకవిటి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి - చిత్తారపురం ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్, వినాయక రైస్ మిల్ మధ్య ఉన్న కల్వర్టు కుంగిపోయింది. ఈ కల్వర్ట్ దశాబ్దాల నాటిది కావడంతో వర్షపు నీటి తాకిడికి బుధవారం ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో ఆమదాలవలస, బూర్జ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై ఆర్ అండ్ బీ ఏఈ సతీష్‌ను వివరణ కోరగా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కెల్ల పాఠశాల పూర్వ విద్యార్థులు

గుర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయికను బుధవారం ఓ ప్రయివేటు రిసార్ట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పటి హెచ్ఎం, ప్రస్తుత ఎంఈవో భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కెల్ల సురేష్, కర్రోతు అప్పలనాయుడు, చందక జగదీష్, కెల్ల సంతోష్, దాసర రాంబాబు, పాండ్రంకి రామచంద్రరావు, కొంగరపు సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

క్రైం న్యూస్

ఆవేశం తెచ్చిన అనర్థం

తోపులాటలో కిందపడి వృద్ధురాలి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

జామి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన వివాదంలో కింద పడిన ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. జట్టేడివలసలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు ఇవీ... గూనురు కొండమ్మ(65)కు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు రెండేళ్ల క్రితం మరణించాడు. దీంతో పెద్దకోడలు లక్ష్మి అత్తవారింట్లోనే ఉంటోంది. కోడలు కొద్దిరోజుల క్రితం డెంకాడలోని పుట్టింటికి వెళ్లి...బుధవారం మళ్లీ అత్తవారి ఇంటికి చేరుకుంది. ఆమెతో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను తీసుకొచ్చింది. కుటుంబ విషయాలపై తన మరుదులు, ఆడపడుచుల సమక్షంలో బుధవారం వివాదం తలెత్తింది. ఈక్రమంలో ఆవేశానికి గురైన లక్ష్మి తన అత్తను నెట్టింది. దీంతో కిందపడిన కొండమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. కొద్దికాలంగా కుటుంబ వివాదాలు ఉన్నాయని... అయినప్పటికీ ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారని స్థానికులు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సీఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

గజపతినగరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పిడిశీల గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... కర్రోతు సాయిసుధ(29)తన భర్త, పిల్లలు ఇంటిలో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త గురునాయుడు బోడసింగిపేట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల ఎం.ఎల్.ఎస్. పాయింట్‌లో కలాసీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వివాహిత ఆత్మహత్యకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆమె తల్లి పల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గోల్డ్‌స్టార్ జంక్షన్‌లోని షాపుల్లో చోరీ

లక్కవరపుకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్‌లో మంగళ వారం రాత్రి నాలుగుచోట్ల దొంగతనాలు జరి గాయి. బాధితులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. గాయత్రి మెడికల్ షాపు ఓనర్ రామారావు తన షాపులో తలుపు పగులగొట్టి సుమారు రూ.4 వేలు తీసుకువెళ్లారని తెలిపారు. భైరవశాస్త్రి తన ఇంటి వద్ద పార్క్ చేసిన హీరోహోండా డీలక్స్ బైక్‌ను ఎత్తుకెళ్లారని చెప్పారు. భోజంగి నాయుడు తన పాన్‌షాప్‌లో సుమారు రూ.1200 నగదు, రూ.4వేల విలువచేసే సామాన్లు దొంగతనానికి గురయ్యాయని తెలిపారు. సాయిబాబా గుడిలో హుండీ దొంగతనానికి గురైనట్లు ధర్మకర్త కిరణ్ తెలిపారు. వీటన్నింటిపై పోలీసులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. హెచ్‌సీ పాపారావు వచ్చి సంఘటనా ప్రాంతాలన్నీ చూసి విచారణ చేపట్టారని కిరణ్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట మండపం ప్రాంతంలో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.48,810 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ పేకాట శిబిరం వైసీపీ యువ నాయకుడి ఆధ్వర్యంలో నడుస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు ప్రశంసలు



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ సుదర్శన్

వేపాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీలకంఠరాజపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసును త్వరితగతిన ఛేదించినందుకు వల్లం పూడి ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐ నాగేశ్వరావు, కానిస్టేబుల్ కనకరాజు, సంతోష్‌లను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ప్రశంసాపత్రాలను అందించారు. ప్రమాదంలో మరిణించిన వ్యక్తి పేరు పీలా శివశంకర్ అని, ఆయన అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గజపతినగరం వాసిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

నెల్లిమర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, సురక్షిత తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని డీఎల్‌పీవో శిరీషరాణి పేర్కొన్నారు. బుధవారం ఆమె రామతీర్థంలో పారిశుధ్యం, తాగునీటి పథకాలు, పన్ను వసూళ్లు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడండి

వంగర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని డీఎల్‌డీవో హేమసుందరరావు సూచించారు. బుధవారం ఆయన మగ్గూరు, కొప్పర, కొత్తవలస, తలగాం, సీతారంపురంలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చెత్త సంపద కేంద్రాలు, వాటర్ ట్యాంకులు, సచివాలయాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శృంగారపు రఘు , గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ప్రాణాలను కాపాడండి

నెల్లిమర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి విద్యార్థులను కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రాష్ట్ర రహదారిపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రమణ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఈ పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

కొత్త విషయాలపై ఆసక్తి పెంచుకోండి

విజయనగరం కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు, ప్లేస్‌మెంట్ అధికారి వీఎస్ వకుళ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

విజయనగరం టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) విజయనగరం జిల్లా కార్యవర్గం బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలని చెప్పారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



పర్సన్‌ఇన్‌చార్జి, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జగదీశ్వరి

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం గరుగుబిల్లిలో పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జిగా పి.పూర్ణచంద్రరావు, డైరెక్టర్లగా కె.అరుణ్‌కుమార్, బి.రామారావు ప్రమాణ స్వీకారంచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, కొప్పల వెలమసంక్షేమ డైరెక్టర్లు ఎ.మధుసూదనరావు, జి.వెంకటనాయుడు,నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎంటీ విజయవాంకుశం, ఎం.తిరుపతినాయుడు, సత్యనారాయణ, రాంబాబు, నారాయణస్వామి, సీతంపేట రవికుమార్, శివకుమార్, పొట్నూరు వెంకటనాయుడు,గౌరమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ తెలిపారు. ఉద్దవోలు సర్పంచ్ వావిలాపల్లి భూదేవి, దివాకర్ కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల సర్పంచ్ కుమారుడు మృతి చెందిన విషయం విదితమే.

మురుగు నీరు మళ్లింపునకు కార్యాచరణ

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో వరదతో పాటు మురుగునీరు మళ్లింపునకు కార్యాచరణ రూపొందించనున్నట్లు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.బుధవారం పార్వతీపురంలోని బైపాస్ రహదారిలోని సాయిబాబా ఆలయం వద్ద కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని తెలిపారు. వరహాల గెడ్డ వరద ఉధృతిని పరిశీలించి, లోతట్టు ప్రాంతాల నివాసితులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరాజు, ఏఈ అప్పారావులను కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. పట్టణంలోని రామకళా మందిర్ థియేటర్ వద్ద ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు నిర్వహణకుమండపాలు ఏర్పాటువేసేవారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారంఇచ్చి అనుమతి తీసుకోవాలని ఎల్విన్‌పేట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.మండపాలు ఏప్రాంతంలో ఎన్నిరోజులు ఉంచుతారు, ఏప్రాంతంలో నిమజ్జనంచేస్తారు తదితర అంశాలు దరఖాస్తులో తెలియజేయాలని కోరారు.

వర్షం వస్తే.. వణుకే!

(5వ పేజీ తరువాయి)

వారు వాపోతున్నారు. ఇదిలా ఉండగా దుగ్గేరు సమీపంలో అడారిగెడ్డపై రూ.6కోట్లతో హైలెవిల్ వంతెన , గుంటభద్ర వద్ద రూ.కోటీ 50లక్షలతో మరో వంతెన నిర్మాణానికి గత వైసీపీ నాయకులు శంకుస్థాపనలు చేసి వదిలేశారు. ఈ రెండు వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఏఈ జి.శంకరరావు తెలిపారు.

గోముఖి ఉప్పొంగితే..

మక్కువకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కవిరిపల్లి వద్ద గోముఖి నదిపై కూడా వంతెన నిర్మాణం చేపట్టడం లేదు. ఏటా వర్షాకాలంలో వీఆర్‌ఎస్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తే.. ఇక్కడున్న కాజ్‌వేపైకి భారీగా వరద చేరుతుంది. దీంతో సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే ఎంతోమంది గ్రామస్థులు ఈ కాజ్‌వేపై వరద ఉధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. మూగజీవాలు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయి. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా కాజ్‌వేపై వరద ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామస్థులు అరచేతిలో ప్రాణాలకు పెట్టుకుని స్వగ్రామాలకు చేరుతున్నారు. వాస్తవంగా 1995లో అప్పటి పార్వతీపురం ఎంపీ వైరచర్లకిషోర్‌చంద్రసూర్యనారాయణదేవ్ మంజూరు చేసిన రూ.27లక్షలతో పార్వతీపురం ఐటీడీఏ అధికారులు ఈ కాజువేను నిర్మించారు. అయితే ప్రస్తుతం దాని పిల్లర్లు శిథిలమయ్యాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కాజ్‌వే కింద భాగం బాగా పాడైంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో కవిరిపల్లి, శంబర, ఎస్.పెద్దవలస, సన్యాసిరాజపురం పంచాయతీల్లోని 15గ్రామాలతో పాటు సాలూరు మండలంలోని మావుడి, తదితర గిరిశిఖర గ్రామస్థులకు ఏటా వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. జూన్ నెల నుంచి అక్టోబరు వరకు గోముఖీ నదికి వరద తాకిడి ఎక్కువైన సమయంలో మూడు, నాలుగు రోజుల పాటు ఈ కాజ్‌వేపై మీదుగా రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. ఏటా జరిగే శంబర పోలమాంబ జాతరకు 60శాతం మంది భక్తులు మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఇంతవరకు వంతెన నిర్మాణానికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలొస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని మక్కువ మండల ఇంజనీరింగు అధికారి రంజిత్‌కుమార్ తెలిపారు.

ఏటా ఇబ్బందులు

దుగ్గేరు వద్ద అడారిగెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రాజకీయ నాయకులు హామీలకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి. అడారిగెడ్డపై వంతెన నిర్మిస్తే దుగ్గేరు ఏజెన్సీ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందుతుంది.

-మండలగిరిధర్, ఆదివాసి గిరిజన జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, దుగ్గేరు

నిధులు మంజూరు చేయాలి

ఏటా వర్షాకాలంలో దుగ్గేరు వద్ద అడారిగెడ్డ కాజ్‌వే దాటే క్రమంలో గిరిజనులతో పాటు పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

-కొండతామర మాలతి, గిరిజన రైతు. మెండంగి గ్రామం

గంటలోనే ఆస్తి పత్రాలు

(5వ పేజీ తరువాయి)

వేగవంతమైంది. ఆధార్ ఆధారిత ఈకేవైసీ, డిజిటల్ సంతకాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఫలితంగా ఒక గంటలోపుపత్రాలు అందుతాయి. గతంలో రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వారం రోజులకు డాక్యుమెంట్లు చేతికి వచ్చేవి. జిల్లాలో నాలుగు సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యాలు ఉన్నాయి. పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండలో రోజుకు సరాసరి 37 డాక్యు మెంటకు సంబంధించి ముందురోజు స్లాట్ బుక్ చేసుకోవచ్చు.అయితే ప్రస్తుతం ఒక్కో రిజిస్ట్రార్ కార్యాలయంలో 15-20 మధ్య స్లాట్స్ బుక్ అవుతున్నాయి.

నిర్వహణ లేక.. అధ్వానంగా మారి

● అడుగడుగునా గోతులమయం ● ఇదీ గరుగుబిల్లి మండలంలో లింక్ రోడ్ల పరిస్థితి



ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదాయంలో రహదారి గోతుల్లో చేరిన వర్షం నీరు

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల పరిధిలోని లింక్ రహదారులు నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి.దీనికితోడు కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగడుగునా గోతులమయమయ్యాయి. ఆ గోతుల్లో నీరు చేరుతుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.గతంలో గోతులమయం కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో ప్రయాణానికి అగచాట్లు తప్పడంలేదు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదా యం,రావుపల్లి నుంచి కొత్తూరు, చిలకాం, శివ్వాం మధుర సీమలవానివలస, పెదగుడబ పరిధిలోని సన్యాసిరాజుపేట, గరుగుబిల్లి నుంచి బీవీపురం, తదితర రహదారులపై ఏర్పడిన గోతుల్లో నీరుచేరింది. గతంలో లింక్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరైనా వైసీపీ ప్రభుత్వ హయాంలో వెనక్కి వెళ్లాయి. ఆ తర్వాత రహదారుల మరమ్మతులకు సైతం నిధులు మంజూరు కాలేదు. ఏళ్లతరబడి మరమ్మతులు లేకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులుతప్పడం లేదు. ఉపాధి పథకంలో నిధులు మంజూరుచేసి రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వాహనచోదకులు కోరుతున్నారు.



వీరఘట్టం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సీతంపేట రూరల్:ర్యాలీని ప్రారంభిస్తున్న ఏపీవో చిన్నబాబు

దోమల నివారణకు సహకరించాలి

● జిల్లా వ్యాప్తంగా వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీలు

దోమల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రపంచదోమల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.

● సీతంపేట రూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):సీతంపేటలో దోమల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపాటించడం వల్ల దోమలను నివారించవొచ్చని తెలిపారు. అనంతరం సర్‌రోనాల్డ్‌రోస్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యం, డీడీ అన్నదొర, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్, సబ్‌యూనిట్ అధికారి జె. మోహనరావు పాల్గొన్నారు.

● వీరఘట్టం,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు సాయి కోరారు.ఈ మేరకు బుధవారం వీరఘట్టం పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు.

● సాలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సాలూరులో దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పురపాలకసంఘం నుంచి పట్టణ ప్రధాన కూడలి వరకు వరకు కమిషనర్ టీటీ.రత్నకుమార్ ఆధ్వర్యంలో పట్టణ మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎం.ఈశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పారిశుధ్య సిబ్బందితో కలిసి దోమలవ్యాప్తి ద్వారా కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

'జనవాణి'లో ఎమ్మెల్యే వినతుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విజయవాడలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు. సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఆయన వెంట జనసేన నాయకులు కొండదాడి రాజేష్, కొంచాడ అరుణ్, వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్, ఎంపీటీసీ నవీన్, మండల నాయకులు మిడతాన ప్రసాద్ ఉన్నారు.

గర్భిణుల వసతిగృహం పరిశీలన

సీతంపేట రూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని శ్రీకాకుళం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అనిత బుధవారం సందర్శించారు. వసతిగృహంలో గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పది పీహెచ్‌సీల సీనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.

ఎస్‌జీటీలకు పదోన్నతులు

సీతంపేట రూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):సీతంపేటఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పదిమంది ఎస్జీటీలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లగా బుధవారం పదోన్నతులు కల్పించినట్లు డీడీ అన్నదొర చెప్పారు.వీరికి గిరిజనసంక్షేమశాఖ కార్యాలయంలో పదోన్నతుల ఆర్డర్లు ఇచ్చామని పేర్కొన్నారు.

యూరియా కోసం అగచాట్లు

పార్వతీపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు యూరియాకోసం అగచాట్లకు గురవుతున్నారు. జిల్లాకు అవసరమైన మరో ఐదు వేల టన్నులు యూరియా బుధ వారానికి రాలేదు. దీంతో ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తక్షణమే వరిపైరుకు యూరియా చల్లాల్సిఉంది. కాగా యూరియా ఇప్పటివరకు రైతులకు సరఫరా చేశామని, జిల్లాకు కావాల్సిన యూరియా కోసం నివేదిక అందించామని జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలించుకోండి: పీడీ



సాలూరు: మాట్లాడుతున్న సుధారాణి

సాలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులను పరిశీలించుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ1200 మంది ఓటర్ల దాటిన పోలింగ్‌బూత్‌లను మార్పులు చేస్తామని తెలిపారు. ఓటర్లు జాబితా, పోలింగ్ స్టేషన్లకు సంబంధించి పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పవచ్చని పేర్కొన్నారు.

● పాచిపెంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వెలుగు సంఘ సభ్యులకు మంజూరైన పలు పథకాల నిర్వహణపై డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి పరిశీలించారు. కర్రివలస పంచాయతీ చాపరాయివలసలో మహిళా సంఘ సభ్యురాలు కూనేటిలక్ష్మి పీఎంఈజీపీ పథకం ద్వారా ఏర్పాటుచేసిన నాటుకోళ్ల పెంపకం కేంద్రాన్ని, అదే గ్రామంలో గల డెయిరీ ఫారం యూనిట్, అనంతరం అమ్మవలస మెగాగోకులంలో ఆవులు పెంపకం యూనిట్ పరిశీలించారు. పాచిపెంట వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యను పరిశీలించారు. ఆమెవెంట డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం సత్యనారాయణ ఉన్నారు.

ఇసుక క్వారీలో లారీ సీజ్

పాలకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గొట్టమంగళాపురం వద్ద నాగావళి నదిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక క్వారీలో బుధవారం సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యంత్రాలు, లారీని సీజ్ చేసి పోలీస్ అధికారులకు అప్పగించారు. ఆయనవెంట తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎస్‌ఐ ప్రయోగమూర్తి, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, వీఆర్వోలు బంకి రాజా ఉన్నారు.



ఇసుకర్యాంప్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న స్వప్నిల్ జగన్నాథ్

రేపు ప్రజా వేదిక

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో శుక్రవారం ఉపాధి పథకానికి సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి, ఎస్‌ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 20 కోట్లుకు పైబడి చేసిన ఖర్చుకు గానుగ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజావేదికకు డ్వామా పీడీ కె.రామచంద్రరావు హాజరవుతున్నారని తెలిపారు.

26న మండల సమావేశం

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఎంపీపీ రామారావు అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి, మూడో విడతలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఈ నెల నుంచి 26 లోగా తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు. బుధవారం దొవ్వమంగి పంచాయతీలో ప్రధానమంత్రి జన్‌ధన్‌పథకం కింద పీవీటీజీల ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. నిర్మాణ సమయంలో సమస్యలొస్తే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నేలను కాపాడితే తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని బయో రిసెర్చ్ కేంద్రం(బీఆర్‌సీ) ఎన్‌పీఎంఎంటీ భీమారాజు పిలుపునిచ్చారు. బుధవారం నందివానివలసలోని జట్టు ఆశ్రమంలో బయో రిసెర్చ్ కేంద్రం నిర్వాహకులకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని ప్రకృతి వ్యవసాయంతో కాపాడాలని కోరారు. గ్రామాల్లో బయో రిసెర్చ్ కేంద్రాల ద్వారా సాగుకు కావలసిన కషాయాలు, ద్రావణాలు అందించుటట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌పీఎంయూ ప్రవీణ్, అన్నపూర్ణ, అప్పారావు, బి.అప్పారావు పాల్గొన్నారు.

పింఛన్‌కోసం దివ్యాంగులు అప్పీల్ చేసుకోవాలి

పాలకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల పింఛన్ అప్పీల్ ప్రక్రియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు తాము అర్హులమని భావిస్తే ఎంపీడీవో లేదా మునిసిపల్ కమిషనర్‌కు అర్జీను సమర్పించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. అధికారులు అర్జీని పింఛన్ పోర్టల్‌లో అప్ లోడ్ చేసి తదుపరి కార్యాచరణ చేపడతారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆసుపత్రికి హాజరు కావాలని మరో నోటీసు జారీ చేస్తారని పేర్కొన్నారు.

● గరుగుబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్లు పొంది రద్దైన వారు సంబంధిత సచివాలయాల పరిధిలోనే దరఖాస్తులు అందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి ఒక ప్రకటనలో కోరారు. రద్దైన పింఛన్‌దారులు నోటీసులు పొందిన తర్వాత అర్హులై ఉంటే ఆధార్, సదరంధ్రువీకరణ పత్రం, గతంలో మంజూరుచేసిన వైద్య ధ్రువీకరణ పత్రం, అవసరమైన పత్రాలను సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లుకు అందించాలని కోరారు.

● సాలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పింఛన్లు పునరుద్ధరణ కోసం నేరుగా తమ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ టీటీ రత్రాకర్‌ను కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పలువురు దివ్యాం గులు రద్దైనపింఛన్లు పునరుద్ధరించాలని వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 74 పింఛన్లు ఇటీవల రద్దయ్యాయని,ఇందులో 20 దివ్యాంగ పింఛన్లను వృద్ధాప్య పింఛన్లగా మార్చనున్నట్లు చెప్పారు. 54 పింఛన్లు పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు.

కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా సూర్యచరణ్

జియ్యమ్మవలస, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘ మండలాధ్యక్షుడిగా రేవళ్ల సూర్యచరణ్ పండిట్ ఎన్నికయ్యారు.బుధవారంజియ్యమ్మవలసలోపంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కె.ధర్మారావు అధ్యక్షతననిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్ను కున్నారు.గౌరవధ్యక్షుడిగా ఎం.రామసత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సురేష్, కోశాధికారిగా అల్లు సత్యవతి లను ఎన్నుకున్నారు.

కొత్తవలసలో సామాజిక తనిఖీ

సీతానగరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస పంచా యతీలో ఉపాధిహామీ పథకం పనులపై డైరెక్టర్ జి.శ్రీకాంత్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌పీలు దాసు, గోవిందరావు ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ టీము ద్వారా గ్రామాల్లోని వేతనదారులకు ఉపాధి పథకంలోని హక్కు లు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఈ జీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

రైతులకు యూరియా అందించాలి

పాలకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):పాలకొండ, వీరఘట్టం మండలాల్లో రైతులకు యూరియా, డీఏపీ సక్రమంగా అందించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. పాలకొండలో సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పాలకొండ, వీరఘట్టం మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి అందించారు.

నగర పంచాయతీ అభివృద్ధిపై చర్చ

నగర పంచాయతీ అభివృద్ధి, కోటదుర్గమ్మ దేవాలయం అభివృద్ధి, రెవెన్యూ పరంగా చేయాల్సిన పనులపై టీడీపీ నాయకులు పల్లా కొండబాబు, టీడీపీ పట్టణాధ్యక్షుడు సంతోష్‌కుమార్ సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌తో చర్చించారు. వారిద్దరు సబ్‌కలెక్టర్‌ను కలిశారు.